# మెడికల్ షాపులు, ఫార్మసీలలో ఆకస్మిక తనిఖీలు

- విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,



విజయనగరం మే 14 మనం న్యూస్: జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం, వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయించే నిషేధిత మందులు, యువతను మత్తు వ్యసనాల బారిన పడేలా చేస్తున్న అక్రమ ఔషధాల సరఫరా వ్యవస్థపై కఠిన చర్యలులో భాగంగా మే 14న విజయనగరం 1వ, 2వ పట్టణ పోలీసులు, డ్రగ్ కంట్రోల్ సిబ్బంది ఈగల్ సిబ్బందితో ఆపరేషన్ గరుడ పేరుతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, వెల్లడించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - మత్తు పదార్థాలు మరియు నిషేధిత మందుల అక్రమ విక్రయం సమాజానికి తీవ్రమైన ప్రమాదంగా మారుతోందని, ముఖ్యంగా యువత మత్తు వ్యసనాలకు గురై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో అక్రమ ఔషధాల విక్రయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యం మరియు యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టినట్లు తెలిపారు. విజయనగరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న మెడికల్ షాపులు, ఫార్మసీలలో జిల్లా పోలీసులు, డ్రగ్ కంట్రోల్ సిబ్బంది మరియు ఈగల్ సిబ్బందితో సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఇటీవల కాలంలో మత్తు ప్రభావం కలిగించే కొన్ని ఔషధాలను వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారం పోలీసులకు అందిన నేపథ్యంలో ఈ ఆపరేషన్ చేపట్టినట్లు ఎస్పీ వివరించారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు మరియు ఉద్యోగ వర్గాలను లక్ష్యంగా చేసుకుని కొన్ని మెడికల్ షాపులు నిబంధనలకు విరుద్ధంగా మందులను విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.ఆపరేషన్ గరుడలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, పలు పట్టణాలు, మండల కేంద్రాలు మరియు గ్రామీణ ప్రాంతాల్లోని ఫార్మసీలను తనిఖీ చేస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఈ తనిఖీలలో మెడికల్ షాపుల లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు, అమ్మకాల రికార్డులు, కొనుగోలు బిల్లులు మరియు ప్రిస్క్రిప్షన్ రికార్డులను అధికారులు పరిశీలించినట్లు తెలిపారు.

ఈ తనిఖీలలో ఎటువంటి నిషేదిత మందులు దొరకలేదని తెలిపారు.ప్రతి మెడికల్ షాప్ యజమాని ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులను విక్రయించరాదని సూచించారు. ఫార్మసీ నిర్వహణలో పారదర్శకత ఉండాలని, ప్రతి అమ్మకానికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.ఆపరేషన్ గరుడ కేవలం ఒకరోజు కార్యక్రమం కాదని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. అక్రమ మత్తు పదార్థాల విక్రయం, నిషేధిత మందుల సరఫరా యువతను తప్పుదోవ పట్టించే కార్యకలాపాలపై జిల్లా పోలీసు శాఖ ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా కొనసాగిస్తుందని తెలిపారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా మందులను విక్రయించినట్లు గుర్తిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వైద్యుల సలహా లేకుండా ఎటువంటి మందులు వాడరాదని, అనుమానాస్పదంగా మందులు విక్రయిస్తున్న మెడికల్ షాపుల సమాచారం తెలిస్తే వెంటనే డయిల్ 100/112 కు లేదా స్థానిక పోలీసులకు లేదా డ్రగ్స్ కంట్రోల్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో ప్రజల ఆరోగ్యం, శాంతి భద్రతలు మరియు యువత భవిష్యత్తు పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని ఎస్పీ గారు పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే వారెవ్వరినీ ఉపేక్షించబోమని, అక్రమ ఔషధాల విక్రయాన్ని పూర్తిగా అరికట్టే వరకు ఆపరేషన్ గరుడ కొనసాగుతుందని హెచ్చరించారు.ఈ ప్రత్యేక తనిఖీలలో 1వ పట్టణ సిఐ ఆర్.వి.ఆర్.కే.చౌదరి, 2వ పట్టణ సిఐ టి.శ్రీనివాసరావు, డ్రగ్ ఇన్స్పెక్టర్ లలిత, ఈగల్ టీం ఎస్ఐ స్వేటీ, ఎస్ఐ రవి ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రమకు శిరసువంచిన మాజీ సర్పంచ్ వడ్లపాటి

ఉపాధి కూలీలతో కలిసి మట్టితట్లు మోసిన వడ్లపాటి రాజేంద్రప్రసాద్.

ఎండవేడిలో చల్లటి మజ్జిగ పంపిణీ చేసి కార్మికులకు ఊరటనిచ్చిన మాజీ సర్పంచ్.

కష్టపడి శ్రమించడంలో రాష్ట్ర మంత్రి రామానాయుడు తనకు ఆదర్శమని తెలిపిన రాజేంద్రప్రసాద్.



పోడూరు మే 14 మనం న్యూస్ : పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం వద్దిపర్రు గ్రామంలో పంట బోదుల్లో పూడిక తొలగింపు పనులు ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో కొనసాగుతున్న సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ వడ్లపాటి రాజేంద్రప్రసాద్ ఉపాధి హామీ శ్రామికులతో కలిసి స్వయంగా పనిలో పాల్గొని మట్టితట్లు మోసి అందరినీ ఆకట్టుకున్నారు. మండుటెండలను లెక్కచేయకుండా కూలీలతో సమానంగా శ్రమించిన ఆయన అనంతరం కార్మికులకు చల్లటి మజ్జిగ పంపిణీ చేసి ఎండ వేడి తీవ్రత నుంచి ఉపశమనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గంలో ఎక్కడ శ్రామికులు కష్టపడి పనిచేస్తున్నారో అక్కడికి వెళ్లి వారితో కలిసి శ్రమించే రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తనకు ఆదర్శమని తెలిపారు. ప్రజల కోసం ప్రజాప్రతినిధులే ముందుండి పని చేయాలనే సంకల్పంతో తాను కూడా ఉపాధి కూలీలతో కలిసి పనిచేస్తున్నానని చెప్పారు. ఉపాధి హామీ కార్మికులకు పంట బోదుల్లో పనులు ఎలా సమర్థంగా చేయాలో వివరించి సూచనలు అందించినట్లు తెలిపారు.

# రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు

## వ్యవసాయ శాఖ అధికారిని కృష్ణవేణి



అనకాపల్లి /చీడికాడ మే 14 మనం న్యూస్: అనకాపల్లి జిల్లా చీడికాడ మండలానికి వ్యవసాయ యాంత్రీకరణ కింద 9.15 లక్షలు ప్రభుత్వం కేటాయించిందని మండల వ్యవసాయ అధికారిని కృష్ణవేణి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ పథకంలో పవర్ టిల్లర్, ట్రాక్టర్లు, దమ్ము దుక్కి సెట్లు, స్ప్రేయర్లు, పవర్ విడర్ రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు.ఆసక్తి గల రైతులు స్వయంగా ఎవరికి వారే ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చనీ. ఈనెల 19వ వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయనీ. వివరాలకు గ్రామాలలో ఉన్న వ్యవసాయ/ ఉద్యాన సహాయకులను సంప్రదించవలెనన్నారు.ఎస్సీ, ఎస్ టి, చిన్న సన్న కారు రైతులకు 50% రాయితీ మరియు పెద్ద రైతులకు 40% రాయితీ కల్పించడం జరుగుతుందనీ. మే 19 తర్వాత వచ్చిన దరఖాస్తులన్నిటిని జాయింట్ కలెక్టర్ వారి ఆధ్వర్యంలో లాటరీ విధానంలో లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మే 26 నుంచి ఎంపికైన లబ్ధిదారులు తమ వాటాను డీలర్లకు చెల్లించాల్సి ఉంటుందనీ. గత సంవత్సరం సబ్సిడీలో వ్యవసాయ పనిముట్లు తీసుకున్న రైతులు అర్హులు కాదనీ. కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందనీ. ఈ పంటలో తప్పనిసరిగా నమోదయి ఉండాలనీ.ఎంపికైన రైతులకు మే 26 తర్వాత నుండి వ్యవసాయ పనిముట్లను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని ఆమె కోరారు.

## గంజాయి సేవించే వారిని నిర్ధారించేందుకు

# టిహెచ్‌సి పరీక్ష పరికరాల పంపిణీ



- జిల్లా ఎస్పీ ఎస్.వి,.మాధవ్ రెడ్డి


పార్వతిపురం మే 14 మనం న్యూస్: మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ చేపడుతున్న చర్యల్లో భాగంగా, మాదక ద్రవ్యాల నియంత్రణలో పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్ శాఖ మరో ముందడుగు వేసి జిల్లా లో గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల సేవించే వారిని తక్షణమే గుర్తించేందుకు టి హెచ్ సి టెస్ట్ కిట్స్ ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ కిట్స్ను జిల్లాలోని ప్రతీ పోలీస్ స్టేషన్ అధికారులుకు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి ఇతర మాదక ద్రవ్యాల సేవించే వారిని తక్షణమే గుర్తించేందుకు టి హెచ్ సి టెస్ట్ కిట్స్ ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. వీటి ద్వారా గంజాయి,ఇతర మాదక ద్రవ్యాల సేవించే వారిని, అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి వారు గంజాయి,మత్తుపదార్థాలు సేవించారో లేదా అనేది ఈ కిట్ ద్వారా నిర్ధారణ చేసుకునే అవకాశం ఉంటుందని, కన్స్యూమర్లను వీటి ద్వార గుర్తించి వారి మీద చట్టపరమైన చర్యలు మరింత వేగవంతంగా తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కిట్స్ ఏ విధంగా ఉపయోగించాలి, ఏ విధంగా నిర్ధారించుకోవాలనే అంశాలను పోలీస్ అధికారులుకు ఎస్పీ క్లుప్తంగా వివరించారు. మత్తు పదార్థాలు సేవించిన లేదా అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి వారి మూత్రాన్ని ఈ కిట్స్ ద్వారా పరీక్షించి వారు మత్తు పదార్థాలు సేవించారో లేదా త్వరితగతిన నిర్ధారణ చేసుకోవచ్చు అని తెలియజేసారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, జిల్లాలో డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రత్యేక నిఘా మరియు తనిఖీలు నిత్యం కొనసాగుతున్నాయని ఎస్పీ తెలిపారు. మత్తు పదార్థాలకు వ్యతిరేఖంగా జిల్లా అంతటా క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అలాగే మీ చుట్టుపక్కల తెలిసిన వ్యక్తులు గాని,స్నేహితులు గాని ఎవరైనా మత్తుపదర్థాలకు బానిస అయినట్టు తెలిసిన లేదా రవాణా,అమ్మకం, వినియోగం గురించి ఎటు వంటి సమాచారం వున్నా దగ్గరలో వున్న పోలీస్ స్టేషన్ లలో గాని లేదా 1972 కు గాని,100కు సమాచారం అందించాలని ప్రజలను జిల్లా ఎస్పీ కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటుగా అదనపు ఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, ఏఎస్పీ మనీషా రెడ్డి, పాలకొండ డిఎస్పీ రాంబాబు, సిఐ లు, ఎస్సు లు పాల్గొన్నారు.

## టౌన్ హాల్ అధ్యక్షుడిగా రాధాకృష్ణ



పాలకొల్లు, మే 14,మనం ప్రతి నిధి : పాలకొల్లు పట్టణ టౌన్ హాల్ అధ్యక్షుడిగా ప్రముఖ హైకోర్టు న్యాయవాది పోలిశెట్టి రాధాకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి పిల్లా బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యదర్శిగా కాజ సొసైటీ చైర్మన్ పంజా నరసింహారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ట్రెజరర్ గా కంచర్ల మాణిక్యం, జాయింట్ సెక్రటరీగా గుణ్ణం వెంకటరత్నం నాయుడు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఆడబాల సూర్యచంద్రరావు, చింత సోమయ్య, ద్వారంపూడి వెంకట సూర్యనారాయణ రెడ్డి, అబ్బిరెడ్డి వెంకట నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

## స్పందించిన అటవీ శాఖ అడవి దున్ననకు ప్రాణ రక్షణ



అనకాపల్లి/చీడికాడ మే 14 మనం న్యూస్ : ప్రమాదవసత్తు నేలబావిలో పడిన అడవి దున్నను అటవీశాఖ అధికారులు సకాలంలో స్పందించి రక్షించిన సంఘటన చీడికాడ మండలంలో చోటుచేసుకుంది. అనకాపల్లి జిల్లా చీడికాడ మండలంలోని మంచాల సమీపానగల అరగల మెట్ట పరిసర ప్రాంతాల్లో ముర్రు కన్నం నాయుడు అనే రైతు కు చెందిన నేలబావిలో అడవి దున్న గురువారం మధ్యాహ్నం నీరు తాగేందుకు వచ్చి ప్రమాదవసత్తు పడిపోయింది .ఈ సంఘటన చూసిన పలువురు అటవీ శాఖ అధికారులకు తెలియజేయడంతో చోడవరం రేంజ్ అధికారి చిట్టపులి సింహాచలం పడాల్, డిప్యూటీ రేంజ్ అధికారి స్వర్ణలత, ఫారెస్ట్ బీట్ అధికారి నటరాజ్, అటవీ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో జెసిబి ని తీసుకువచ్చి నేలబావిని లెవెల్ చేసి అడవి దున్న బయటికి వచ్చేలా చేసి అడవిలోకి విడిచిపెట్టారు.

# ప్రభుత్వం కల్పించుకుని ఆక్వామేత దారుల సిండికేట్ వ్యవస్థను రూపుమాపాలి

- ఆక్వా రైతు సంఘ నాయుడు త్సవటపల్లి నాగభూషణం తీవ్ర ఆరోపణలు..
- ఆక్వా రైతులను నిస్సాయ స్థితిలోకి నెట్టి సిండికేట్ వ్యవస్థ దగా చేస్తోంది..!
- ఆక్వా రంగంలోకి కార్పోరేట్ దిగ్గజాలు రావాలి..



అమలాపురం, మే 14 మనం న్యూస్: ఆక్వా పరిశ్రమ సిండికేట్ వ్యవస్థగా కొంత మంది చేతుల్లో ఉండి ధరలను డిక్టేట్ చేయడానికి కారణం రొయ్యకు సంబందించిన మేత కొంత మంది చేతుల్లో ఉండబట్టేనని దీనిని ప్రభుత్వం రూపుమాపాలని ఆక్వారైతు సంఘ నాయకుడు త్సవటపల్లి నాగభూషణం డిమాండ్ చేశారు. రొయ్యల మేతలను రైతు నేరుగా తయారీ చేసుకోలేడు కాబట్టి ఇదే అదనుగా ఇష్టారాజ్యంగా రేట్లు పెంచుతున్నారని మండిపడ్డారు. రైతు పండించే రొయ్య కూడా నిల్వ చేసుకునేందుకు అవకాశం లేకపోవడం, కేవలం కొంత మాత్రమే ఎగుమతి చేసే వ్యవస్థ ఉండడంతో కొనుగోళ్ల ధరలలో ఇష్టానుసారంగా హెచ్చుతగ్గులు చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఇది వారి అవసరానికి అనుగుణంగా మార్చుకునేంత స్థాయిలో వ్యవస్థను మార్చేశారన్నారు. ఇందులో చాలా మంది ఫీడ్ కంపెనీలు, ఎక్స్పోర్ట్ కంపెనీలు, హేచరీలు ఇలా ఒక్కరే కలిగి ఉండడం ఇది రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. దీనిని నుంచి రైతులు విముక్తి పొందాలంటే ప్రభుత్వం చొరవ చూపి మేత మీద మెటీరియల్ మీద కొన్ని నిభందనలు పెట్టి రైతుకు ఉపయోగపడేలా సిండికేట్ వ్యవస్థను రూపుమాపాలని కోరారు. కల్చర్ ఎక్కువగా ఉన్న రెండు మూడు జిల్లాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఆక్వా రైతులను ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కమిటీలుగా ఏర్పరిచి వాళ్లకే సబ్సిడీలు కల్పించి ప్రభుత్వ అజమాయిషీలో కోల్డ్ స్టోరేజీలు, ఫీడ్ మిల్లులు ప్రభుత్వం 50 శాతం భాగస్వామ్యంతో ఏర్పాటు చేసేలా ముందుకు వస్తే ఈ ఆక్వా పరిశ్రమ మనుగడ సాధిస్తుందన్నారు. అలానే దిగ్గజాలైన పారిశ్రామిక వేత్తలు అయిన రిలయన్స్, అదానీ తరహా కార్పోరేట్ వ్యవస్థలను ఈ ఎక్స్పోర్ట్, ఫీడ్ మిల్లులు రంగంలోకి తీసుకువస్తే ఖచ్చితంగా ఈ ఆక్వా పరిశ్రమలో తిష్టవేసిన సిండికేట్ వ్యవస్థ ప్రక్షాళన అవుతుందన్నారు. వీళ్ల ఆటలు ఇక సాగవని ఆశాభావం వ్యక్తం చేశారు. 100 నుంచి 200 మంది కి ఉపాధి కల్పించే కంపెనీ గనుక వస్తుంటే వారికి ప్రభుత్వం భారీ సబ్సిడీలను కల్పించి నజరాలను కట్టబెట్టి అవకాశాలు కల్పిస్తోందని, కానీ ఆక్వా పరిశ్రమకు ప్రభుత్వం నుంచి ఒక విద్యుత్తు సబ్సిడీ తప్ప మరేవిధమైన ప్రయోజనం కలగడం లేదన్నారు. ఏవిధమైన రాయితీలు ఆశించకుండా ప్రభుత్వ వృద్ధి రేటులో 36 శాతం కీలక పాత్ర పోషిస్తున్న ఆక్వా పరిశ్రమ విషయంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా కొన్ని లక్షలాది మందికి ఉపాధి కల్పించే ఈ ఆక్వా పరిశ్రమగా ఉన్నప్పటికీ నిర్లక్ష్యం ఉందన్నారు. ఆక్వా రైతులకు జరుగుతోన్న అన్యాయంపై నిర్లక్షధోరణి రైతులపాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దయతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ రంగంపై ప్రత్యేక శ్రద్ధ కల్పించుకుని ప్రస్తుత పరిస్థితుల్లో నష్టాల్లో ఉన్న ఈ ఆక్వా పరిశ్రమను సిండికేట్ ల బారి నుంచి రక్షించాలని కోరుతున్నామన్నారు. ఆక్వా పరిశ్రమలో సిండికేట్ వ్యవస్థ తిష్టవేసిందని నొక్కి చెప్పడానికి అన్ని కంపెనీలకు సంబంధించిన మేతలు ఒకే రేటుగా నిర్ధారించడం, రైతు దగ్గర కొనుగోళ్లు చేసే కౌంటుల వారి రొయ్య ఖరీదు అందరూ ఒకే ధర నిర్ణయించి కొనుగోలు చేయడం వంటివే పెద్ద ఉదాహరణలని, దీని వల్ల రైతుకు అపారమైన నష్టం కలుగుతుందన్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన రొయ్యలు వేర్వేరు దేశాలకు, వేర్వేరు రేట్లకు అమ్ముకోవడం, మేతల్లో కలిపే ముడిసరుకులు వేర్వేరు రేట్ల కు కొనుగోలు చేయడం ఇది కూడా ఉదాహరణ గా కనిపిస్తుందన్నారు. ఇంత సంక్షోభంలో రైతులు రొడ్డెక్కి ఎన్ని ఆందోళనలను చేసినప్పటికీ ఇప్పటికీ వారిలో ఏవిధమైన మార్పు లేకుండా మేత ధరలు పెంచడమే కాకుండా రొయ్యల ధరలు తగ్గించడం మేము తప్ప రైతులకు గత్యంతరంలేదన్న విధంగా వారి వ్యవహారశైలి కనిపిస్తోందని నాగభూషణం మండిపడ్డారు.

## ఒక్కరోజూ కాలేజీకి వెళ్లకుండానే డాక్టర్..‘

# నీట్ పేపర్ లీక్’ నిందితుడి అక్రమాలు




నాసిక్, మే 14: సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో తవ్వేకొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయి. ఈ కేసులో కీలక నిందితుడైన మహారాష్ట్రలోని నాసిక్ ‘డాక్టర్’ శుభం ఖైర్నార్‌ను సీబీఐ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అయితే, అతడి గురించి కీలక విషయం బయటికొచ్చింది. స్థానికంగా డాక్టర్‌గా చలామణి అవుతోన్న శుభం.. ఒక్క రోజు కూడా వైద్యకళాశాలకు వెళ్లకపోవడం గమనార్హం.

శుభం స్వస్థలం నందగావ్. నాసిక్‌లోని అత్యంత రద్దీ అయిన కోచింగ్ కారిడార్‌లో ‘ఎస్ఆర్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ’ని నిర్వహిస్తున్నాడు. ఈ కన్సల్టెన్సీ నేమ్ బోర్డుపై శుభం పేరు ముందు డాక్టర్ అని ఉంది. స్థానికంగానూ అతడు డాక్టర్‌గానే అందరికీ పరిచయం. ఎంబీబీఎస్, బీడీఎస్, బీహెచ్ఎంఎస్ సహా ఇతర మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం ప్రయత్నించే విద్యార్థులకు గైడెన్స్ ఇస్తుంటాడు. అయితే, 2021లో మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ సమీపంలోని శ్రీ సత్యసాయి యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ కోర్సుకు శుభం రిజిస్టర్ చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. దీని గురించి ఆ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌ను సంప్రదించగా.. కీలక విషయాలు బయటికొచ్చాయి. కేవలం అడ్మిషన్ సమయంలోనే శుభం యూనివర్సిటీకి వచ్చాడని, ఆ తర్వాత ఏనాడూ క్లాసులకు హాజరుకాలేదని వీసీ చెప్పారు. పరీక్షలు కూడా రాయలేదని తెలిపారు.

ఈ నీట్ లీకేజీ వ్యవహారం తొలుత రాజస్థాన్‌లో బయటపడిన సంగతి తెలిసిందే. దీంతో తీగ లాగితే నాసిక్ నుంచే ఈ ప్రశ్నపత్రం లీకైనట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. నీట్ పేపర్‌ను శుభం తనకు తెలిసిన ఓ వ్యక్తి నుంచి రూ.10 లక్షలకు కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో తెలిసింది. కొరియర్‌లో వచ్చిన ఆ ప్రశ్నపత్రాన్ని శుభం పీడీఎఫ్ రూపంలోకి మార్చి వాట్సప్‌లో గురుగ్రామ్‌లోని ఓ వ్యక్తికి రూ.15లక్షలకు విక్రయించినట్లు అధికారులు గుర్తించారు. అక్కడి నుంచి ఈ పేపర్ రాజస్థాన్, జమ్మూకశ్మీర్, బిహార్, కేరళ తదితర రాష్ట్రాలకు చేరినట్లు తెలిపారు. పలువురు విద్యార్థులు రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు వెచ్చించి కొనుగోలు చేసినట్లు సీబీఐ వర్గాలు వెల్లడించాయి.

నీట్ పేపర్ లీకేజీ దర్యాప్తులో శుభం గురించి తెలుసుకున్న రాజస్థాన్ పోలీసులు మహారాష్ట్ర అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో అతడిని అరెస్ట్ చేసేందుకు నాసిక్ పోలీసులు రంగం సిద్ధం చేశారు. అయితే పేపర్ లీక్ బయటపడగానే శుభం తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. తనను ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు గుండు చేయించుకుని తిరిగాడు. ఈ క్రమంలో డిజిటల్ ఆధారాలను సేకరించిన పోలీసులు మంగళవారం శుభంను అరెస్ట్ చేశారు. అనంతరం సీబీఐ స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌కు అప్పగించారు. నిందితుడి సోదరుడిని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# ఐటీ కంపెనీల్లో భారీగా లే ఆఫ్‌లు

## అమెజాన్. సిస్కో, లింక్డ్ఇన్ మరో రౌండు తొలగింపులు

హైదరాబాద్, మే 14 : ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్ మరోసారి ఉద్యోగాల కోతలకు సిద్ధమవుతోంది. ఈసారి కంపెనీ సెల్లింగ్ పార్టనర్ సర్వీసెస్ విభాగంలోని కొంతమంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ధృవీకరించింది. ఈ విభాగం థర్డ్ పార్టీ విక్రేతలకు ఆన్బోర్డింగ్, లాజిస్టిక్స్, అకౌంట్ మేనేజ్మెంట్ వంటి కీలక సేవలను అందిస్తుంది. కంపెనీ ఖర్చులను తగ్గిస్తూ, కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా మార్చే ప్రయత్నాల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఈఓ యాండీ జెస్సీ తెలిపారు. ఎంతమందిని తొలగించనున్నదనే విషయంపై కంపెనీ స్పష్టత ఇవ్వలేదు. అమెజాన్ ఇప్పటికే వివిధ విభాగాల్లో దాదాపు 30 వేల ఉద్యోగాలను తొలగించిన సంగతి తెలిసిందే. గత కొన్ని నెలలుగా అమెజాన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విభాగంలో ఎక్కువ పెట్టుబడులు పెడుతోంది. రిటైల్, లాజిస్టిక్స్, క్లౌడ్ సేవలు, ప్రకటనల విభాగాల్లో ఏఐ టూల్స్ వినియోగాన్ని కంపెనీ వేగంగా పెంచుతోంది. ఉద్యోగుల పనిలో ఆటోమేషన్ పెరగడం వల్ల భవిష్యత్తులో ఉద్యోగాల సంఖ్య తగ్గే అవకాశం ఉందని జెస్సీ స్వయంగా చెప్పారు. ఈ లేఆఫ్ ప్రభావం భారత్‌లోని అమెజాన్ ఉద్యోగులపైనా పడనుంది. ముఖ్యంగా సపోర్ట్ ఆపరేషన్స్, అకౌంట్ మేనేజ్మెంట్, లాజిస్టిక్స్ బ్యాక్-ఎండ్ సేవల్లో పనిచేసే వారిపై ఉండొచ్చని సమాచారం. ఇదే బాటలో సిస్కో, లింక్డ్ఇన్ కంపెనీలు కూడా ఉద్యోగులను తొలగించే ప్రక్రియ ఉంటుందని స్పష్టం చేశాయి. నెట్వర్కింగ్ కంపెనీ సిస్కో ఏఐ, సైబర్ సెక్యూరిటీపై ఎక్కువ దృష్టి సారిస్తోంది. ఈ కారణంగా పాత విభాగాల్లోని వారిని తొలగించి, కొత్త సాంకేతికతపై పెట్టుబడి పెడుతోంది. దీంతో మొత్తం ఉద్యోగులలో సుమారు 5 శాతం (దాదాపు 4,000 మంది) తొలగిస్తున్నట్లు ప్రకటించింది. మైక్రోసాఫ్ట్ యాజమాన్యంలోని లింక్డ్ఇన్ కూడా సుమారు 5 శాతం మందిని (దాదాపు 875 మంది) తొలగిస్తోంది. మార్కెటింగ్, ఇంజనీరింగ్, ప్రొడక్ట్ టీమ్స్ లో ఉద్యోగుల కోతలు ఉండనున్నాయి.

